క్లుప్తంగా

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

పెద్దవడుగూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీఓ నాగరాజునాయుడు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నవడుగూరు గ్రామంలో డోర్ టు డోర్ సర్వేను తనిఖీ చేశారు. పంచాయితీలో ఉండే ప్రతి ఒక్కరినీ సర్వే చేసి ఐడీ నెంబర్‌ను కేటాయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. పంచాయతీ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఈఓఆర్డీ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మిలాద్ ఉన్‌నబీ ఘనంగా చేసుకుందాం'

తాడిపత్రి రూరల్: మిలాద్ ఉన్‌నబీని సెప్టెంబర్ 5న ముస్లింలు ఐకమత్యంతో చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక నివాసంలో గురువారం ముస్లిం మత పెద్దలు, ముస్లింలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పండుగ చేసుకోవడానికి సూచనలిస్తే, అందుకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. పట్టణంలో పరిశుభ్రతను పాటించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ వెంకటేశులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని చోరీ కేసుల పురోగతి, రౌడీ షీటర్ల కదలికలపై ఆరా తీశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తుపై పలు సూచనలు అందించారు. ఆయన వెంట సీఐ సత్యబాబు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా విష్ణునారాయణ



పుట్లూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా కడవకల్లు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు విష్ణునారాయణ నియామకమయ్యారు. ఆయన ఎంపికపై మండలంలోని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమణాయాదవ్, నాయకులు నాగభూషణం, కడవకల్లు మల్లికార్జునరెడ్డితో పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

ఘనంగా పాలకమండలి ప్రమాణ స్వీకారం

గుంతకల్లు రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో గురువారం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఓ క్రిష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో బుగ్గ సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణ అనంతరం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. పాలకమండలి చైర్మన్‌గా ఎస్.ఈశ్వరయ్య, ధర్మకర్తలుగా లాలిరెడ్డి, సుబ్బన్న, గంగమ్మ, ప్రకాశరావు, అరుణ, సునీతబాయి, ఎం.శ్రీనివాసులు, అర్చకుడు మంజునాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. వారు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామన్నారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమాదేవి

బుక్కరాయసముద్రం: బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలపై దాడులు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులు, చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట కుమార్, ఐకేపీ ఏపీఎం అనిత, ప్రభుత్వ వైద్య కళాశాల ఆర్ఎంఓ హేమలత, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవి, మహిళా పీఎస్ ఎస్ఐ భారతి, సీడీపీఓ నాగవేణి, అడ్వకేట్ మహేష్, రెడ్స్ ఎన్జీఓ భానుజ, ఎంపీడీఓ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలోని గన్నెవారిపల్లికాలనీలో హనుమంతవాహనంపై వినాయకుడు



తాడిపత్రిలోని తేరు బజారులో 'ఆపరేషన్ సింధూర్' గణపతి



తాడిపత్రిలోని మట్టిదివ్వెలతో గణనాయకుడు



పెద్దపప్పూరు మండలంలోని కొట్టాలపల్లిలో గణనాథుడు



గుంతకల్లులోని రామస్వామి వీధిలో లంబోదరుడు



గుంతకల్లులోని సరస్వతీ విద్యా మందిరం బాలగణపతి



గుంతకల్లులోని సంజీవనగర్ కాలనీలో అయోధ్య వినాయకుడు



గుత్తి ఆర్ఎస్‌లో 1661 టెంకాయలతో వినాయకుడు

వినాయక వైభవం

- వాడవాడలా కొలువైన గణపతి విగ్రహాలు
- మండపాల వద్ద ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



గుంతకల్లులో వినాయకుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి



తాడిపత్రిలోని గాంధీకట్ట వద్ద పంచముఖి గణేషుడు

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో బుధ, గురువారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మంటపాలను రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పోటాపోటీగా ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి. భిన్న రూపాల్లో గణాధిపతులు కొలువుదీరాయి. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మంటపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, వివిధ రకాల కార్యక్రమాలు భక్తులను అలరించారు. అలాగే వివిధ మంటపాల వద్ద అన్నదానాలు చేశారు. పలు గ్రామాల్లో వినాయకుడి చెంత ఉంచిన లడ్డూను నిమజ్జనం సందర్భంగా శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. –సాక్షి బృందం:




గుత్తిలోని రెడ్డి స్ట్రీట్‌లో ప్రకృతి వినాయకుడు



గుంతకల్లులోని ఎస్ఎల్‌వీ థియేటర్ భగీరథ వినాయకుడు




శింగనమలలో కొలువైన వినాయకుడు



గుత్తి రూరల్: బేతాపల్లిలో భారీ వినాయకుడు



పామిడిలో శ్రీకృష్ణుడి అలంకరణలోని విఘ్నేశ్వరుడు



పుట్లూరు మండలం కుమ్మనమలలో వినాయకుడు



యల్లనూరు మండలం చింతకాయమందలో గణపతి



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో వినాయకుడి విగ్రహం



యాడికి అమ్మవారిశాలలో వినాయకుడు



బీకేఎస్ మండలం దయ్యాలకుంటపల్లిలో పెన్సిల్‌లో దర్శనమిస్తున్న వినాయకుడు

బషీరాబాగ్ అమరులకు నివాళి



గుంతకల్లులోట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



పుట్లూరులో నినాదాలు చేస్తున్న వామపక్షాల నాయకులు

గుంతకల్లు/తాడిపత్రి రూరల్/పుట్లూరు/గుత్తి/పామిడి: బషీరాబాగ్ దుర్ఘటనలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు సీపీఐ, సీపీఎం నాయకులు నివాళులర్పించారు. అలాగే విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అలూరు రోడ్డులోని ట్రాన్స్ కో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కరెంట్ చార్జీలను పెంచబోం..స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొట్టండంటూ ప్రచారం చేపట్టి నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం బషీర్ బాగ్ వద్ద అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు కసాపురం రమేష్, రంగమ్మ, చంద్రశేఖర్, షాష, బాష, రామునాయక్, ఉలిగప్ప, తిమ్మప్ప, ఈరన్న వీరేష్, రాము, డానియేల్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

- తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం బషీర్ బాగ్ దుర్ఘటనలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు సీపీఐ, సీపీఎం నాయకులు నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి చిరంజీవి, డివిజన్ కార్యదర్శి జగన్, నరసింహారెడ్డి, నరసింహులు, శ్రీరాములు, నాగేంద్రప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- పుట్లూరు మండలంలోని కడవకల్లులో గురువారం వైఎస్సార్ సర్కిల్ వద్ద అమరవీరుల వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు పెద్దయ్య, సూరి,సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సీపీఐ మండల కార్యదర్శి బాలు, శివారెడ్డి, గౌడ్, పెద్దయ్య పాల్గొన్నారు.
- గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం అమర వీరులకు నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, మల్లికార్జున, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.
- పామిడి పట్టణంలోని విద్యుత్ సబ్-స్టేషన్ కార్యాలయం వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి, అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి, నాయకులు, మల్లేసు, ముత్యాలు, షాషావలి, లక్ష్మణకుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గంగ ఒడికి పార్వతీ తనయుడు



పెద్దవడుగూరులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



యాడికిలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఆర్యవైశ్యులు



యల్లనూరులో విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



పామిడిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో రెండు చోట్ల వినాయకుడి విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించారు. పురోహితులు తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకొన్న విగ్రహాలను సాంప్రదాయ పద్ధతిలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. పేట ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని అమ్మవారిశాలలోని వినాయక విగ్రహాన్ని ఆర్య వైశ్యులు నిమజ్జనానికి తరలించారు. అలాగే మండలంలోని లక్ష్మంపల్లి, చందన, రాయలచెరువు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆటోల్లో, ట్రాక్టర్లలో ఉంచి వేములపాడు సమీపంలో రాయలచెరువు, తాడిపత్రి రహదారిలో మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న వంక వద్ద నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఏఎస్ఐ వెంకటేష్, హెచ్‌సీ సాంబశివుడు, పోలీసులు బందోబస్తున్న నిర్వహించారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం సభ్యులు గురువారం నిమజ్జనం చేశారు. పురవీధుల్లో ఊరేగించుకుంటూ ట్రాక్టరుపై విగ్రహాన్ని తీసుకెళ్లారు. చిత్రావతి నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సభ్యులు బజ్జీలు బాబు, సాయి, కిరణ్, వరుణ్, రమణ , సుమంత్, రాఘవేంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పామిడిలో గురువారం సాయంత్రం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీ మాతా ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహంతో పాటు పంచలోహ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని మండలంలోని రామగిరి చెరువులో నిమజ్జనం చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యం



మాట్లాడుతున్న హరిప్రసాద్ యాదవ్

గుంతకల్లు రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యమవుతోందని, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో సైతం అశ్రద్ధ కనబడుతోందని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్ అధ్యక్షతన ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఎల్‌డీఓ విజయలక్ష్మి, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు అందాల్సిన ప్రయోజనాలు సైతం దుర్వినియోగం అవుతున్నాయన్నారు. కల్లుగీత కార్మికులకు లిక్కర్ షాపుల్లో వాటా ఇచ్చినట్లుగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు లిక్కర్ షాపుల పర్మిషన్ ఇచ్చి న్యాయం జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. మానిటరింగ్ కమిటీ సభ్యుడు చాకరి రవి, సాకే గోవిందు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి ప్రదానం

గుత్తి: పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా హామీ పత్రంపై ప్రజల నుంచి అధికంగా సంతకాలు సేకరించి మండల టాపర్‌గా నిలిచిన గుత్తి కోట జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కు గురువారం బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థికి హెచ్ఎం సుభహాన్, ఉపాధ్యాయులు ట్రావెలింగ్ బ్యాగును బహూకరించి, అభినందించారు.

మురుగు నీటిని అరికట్టండి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పోరాటకాలనీలో అండర్ డ్రైనేజీ నుంచి వస్తున్న మురుగు నీటిని అరికట్టాలని గురువారం సీపీఐ నాయకులు చిరంజీవి, పట్టణ సహాయ కార్యదర్శి నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం డీఈకి వినతి పత్రం అందజేశారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.గురువారం ఎస్ఐ మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు చెందిన సత్యనారాయణ రావు(44)అనే వ్యక్తి తల్లిదండ్రులతో కలసి సంవత్సరం క్రితం గార్లదిన్నెకు వచ్చి ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉన్నారన్నారు. అయితే సత్యనారాయణరావుకు పెళ్లి కాకపోవడంతో మనస్థాపం చెంది, ఈ నెల 20న ఇంటి సమీపంలో విషపుగుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు అతడిని అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని తెలికి గ్రామంలో బుధవారం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజినేయులు తెలిపారు. నిర్వాహకుడు షేక్షాతో పాటు పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి రూ.34,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ శెట్టి తెలిపారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శివ, మనోహర్, రేవతి 60 మందికి కంటి పరీక్షలు చేసి, 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

దుండుగులను కఠినంగా శిక్షించాలి



రూప్లానాయక్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు

గుంతకల్లు: గిరిజనులపై దాడి చేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లదాడిలో గాయపడిని రామ్లానాయక్ గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆయనతో పాటు ఎస్టీ సెల్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు కొనకొండ్ల ఆంజి, వజ్రకరూర్ నాయకుడు కె..నాగరాజుతో కలిసి చికిత్స పొందుతున్న రామ్లానాయక్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనలపై రోజూ దాడులు అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడంలో ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలపై ఏమాత్రం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని లేని పక్షంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, సాకేప్రకాష్, దాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి క్రాస్ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణానికి చెందిన రాఘవేంద్ర, భార్య అశ్విని, కుమార్తె కుందన గుంతకల్లు పట్టణంలోని బంధువుల ఇంటికి బైక్‌లో వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి తాడిపత్రికి వెళ్తుండగా మార్నేపల్లి క్రాస్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రాఘవేంద్ర, అశ్వినికి తీవ్ర గాయాలు కాగా కుందనకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు రాఘవేంద్ర, అశ్వినిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొని ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ లోడుతో హైదరాబాదుకు వెళ్తుండగా లారీ మరమ్మతులకు గురైంది. దీంతో బాచుపల్లి శివారులో లారీని రోడ్డు పక్కన నిలిపి మరమ్మతులు చేసుకుంటున్నాడు. బెంగళూరు నుంచి హైదరాబాదుకు లోడుతో వెళ్తున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఐచర్ డ్రైవర్ కుమరేష్ మురుగన్, లారీని ఆపి మరమ్మతులు చేసుకుంటున్న డ్రైవర్ అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని హైవే అంబులెన్స్ వాహనంలో వెంట గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు వారిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో గురువారం కంటైనర్, మూడు కార్లు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా వివరాల మేరకు హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే కంటైనర్ కల్లూరు తరిమెల క్రాస్ స్పీడ్ బ్రేకర్ల వద్దకు రాగానే డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో వెనుకల మూడు కార్లు ఒక దానికొకటి ఢీకొన్నాయి. కారులో ఉన్న ఇద్దరు చిన్న పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన



గుత్తిలో నిమజ్జనం చేసే ప్రాంతాన్ని అధికారులతో కలసి పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

గుత్తి: గుత్తిలో శుక్రవారం వినాయక నిమజ్జనం కార్యక్రమం జరుగునుంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపల్ అధికారులతో కలిసి గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ గురువారం నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. గుత్తి చెరువు, తురకపల్లి రోడ్డులోని కుంట, ఎస్ఎస్ పల్లి చెరువు, లచ్చానపల్లి కుంటను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల్లోపు నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, తహసీల్దార్ పుణ్య వతి, ఎంపీడీఈ ప్రభాకర్‌నాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సురేష్, గౌతం, ఏఎస్ఐలు నాగమాణిక్యం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిఘా ఉంచాలని పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని చీమలవాగుపల్లి జాతీయ రహదారి చెంతన ఉన్న కుంట వద్దకు నియోజకవర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాలనుంచి గణనాథుల విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయన్నారు. నీటికుంట వద్ద ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఏఎస్ఐ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.